సాక్షి సూర్యాపేట

బుధవారం : 29 : మార్చి : 2023



యాదాద్రిలో నిత్య పూజలు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి.

- 8లో



'బీజేపీ, కాంగ్రెస్'ను తరిమికొట్టాలి

సీఎం కేసీఆర్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నేతలను తరిమికొట్టాలని మంత్రి జగదీశ్‌రెడ్డి సూచించారు.

- 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37° / 24°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (బుధవారం సాయంత్రం)

సహర్ 4-50 (గురువారం ఉదయం)

సమ్మేళనాలు.. యాత్రలు

ఉమ్మడి జిల్లాలో రాజకీయం వేడెక్కుతోంది. ఈ ఏడాదే సాధారణ ఎన్నికలు ఉండటంతో అన్ని పార్టీలు వివిధ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్తున్నాయి. కేంద్ర ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ బీఆర్‌ఎస్, కమ్యూనిస్టు పార్టీలు ప్రజల్లోకి వెళ్తుండగా, కాంగ్రెస్ మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, వైఫల్యాలపై ప్రజలను చైతన్యపరిచే దిశగా ముందుకు సాగుతోంది. ఇక బీజేపీ.. టీఎస్‌పీఎస్సీ పేపరు లీకేజీ, లిక్కర్ స్కాం, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఆందోళన కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తోంది.

-సాక్షి ప్రతినిధి, నల్లగొండ

ప్రజాక్షేత్రంలోకి ప్రధాన పార్టీలు

- ఆత్మీయ సమ్మేళనాల్లో బీఆర్‌ఎస్
- జోడో యాత్రలతో సాగిపోతున్న కాంగ్రెస్
- 'జన చైతన్యం'తో ఉమ్మడి జిల్లాను చుట్టేస్తున్న సీపీఎం
- రాష్ట్ర సర్కార్ వైఫల్యాలపై కమలం శ్రేణుల ఆందోళనలు
- ఒక్కో పార్టీది ఒక్కో ఎజెండా



బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తోంది. జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో స్థానిక ఎమ్మెల్యేలు ఆత్మీయ సమ్మేళనాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. అందులో స్థానిక ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలంతా పాల్గొనేలా చూస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఇవి ప్రారంభమయ్యాయి. ఆత్మీయ సమ్మేళనాలకు నల్లగొండ జిల్లా ఇన్‌చార్జిగా మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని పార్టీ నియమించింది. యాదాద్రి భువనగిరి జిల్లాకు ఎమ్మెల్సీ యాదవరెడ్డి, సూర్యాపేట జిల్లాకు రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ నియమితులయ్యారు. వీరితో పాటు పార్టీ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో సమ్మేళనాలు జరుగుతున్నాయి. సమ్మేళనాల ద్వారా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలన్నింటిని ప్రజలకు తెలియపర్చి వారికి దగ్గర కావాలనే ఉద్దేశంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

జన చైతన్యయాత్రలతో సీపీఎం..

కేంద్ర ప్రభుత్వ వివక్ష పూరిత నిర్ణయాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త కార్యక్రమాల్లో భాగంగా సీపీఎం జన చైతన్య యాత్రల పేరుతో ప్రజల్లోకి వెళ్తోంది. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మూడు బృందాలు యాత్రలను నిర్వహిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ నెల 26వ తేదీ నుంచి ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించాయి. మిర్యాలగూడ, నల్లగొండ, నకిరేకల్, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో చైతన్య యాత్ర నిర్వహించాయి. మంగళవారం భువనగిరి జిల్లాలోనూ యాత్ర కొనసాగింది. ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, నాయకులు తమ్మినేని వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి, చెరుపల్లి సీతారాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను యాత్రల ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నారు. ఈడీ , సీబీఐ ద్వారా ప్రతిపక్షాల గొంతు నొక్కేస్తుందంటూ ప్రచారం చేయడంతోపాటు బీజేపీ మతతత్వ విధానాలు ప్రమాదమంటూ ప్రజల్లోకి వెళ్తున్నారు.

ప్రచార జాతాకు సిద్ధమవుతున్న సీపీఐ

కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సీపీఐ దేశ వ్యాప్త కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో నిరసన కార్యక్రమాలకు సిద్ధమవుతోంది. ఏప్రిల్ 14 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ ప్రచార జాతాలు నిర్వహించనుంది. అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, ధరల పెరుగుదల, మతోన్మాదం తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా సిద్ధమవుతోంది.

జోడో యాత్రతో కాంగ్రెస్..

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కూడా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలపై హాథ్‌సే హాథ్ జోడో యాత్రలు రాష్ట్ర పార్టీ నిర్వహిస్తోంది. నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి , మాజీ మంత్రి జానారెడ్డి నేతృత్వంలో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర నాయకత్వం జిల్లాలో పర్యటించకపోయినా ఈ ముగ్గురు సీనియర్ నేతల నేతృత్వంలో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వాన్ని కేంద్రం రద్దు చేయడాన్ని నిరసిస్తూ ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష పేర కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణిపై ఆందోళన నిర్వహిస్తున్నారు. మరోవైపు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర త్వరలో జిల్లాలోనూ కొనసాగనుంది.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ

టీఎస్‌పీఎస్సీ పేపరు లీకేజీ, లిక్కర్ స్కాం వంటి అంశాలు, రాష్ట్ర వైఫల్యాలను ఎండగడుతూ బీజేపీ ప్రజల్లోకి వెళ్తోంది. ఇటీవలే స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌ల పేరుతో ప్రధాన కూడళ్లలో బీజేపీ సభలను నిర్వహించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూనే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ దగ్గరయ్యే ప్రయత్నం చేస్తూ వస్తోంది. ఇక ఇప్పుడు పేపర్ లీకేజీతో రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ దుమ్మెత్తిపోస్తోంది. అందులో భాగంగా నిరసన కార్యక్రమాలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తోంది.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న జడ్జి శ్యాంకుమార్

- సీనియర్ సివిల్ జడ్జి శ్యాం కుమార్

హుజూర్‌నగర్: ప్రతి ఒక్కరూ కళ్లను కాపాడుకోవాలని, దీనికోసం పరీక్షలు చేయించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాం కుమార్, జూనియర్ సివిల్ జడ్జి సాంకేతిమిత్రలు సూచించారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కంటి చూపు లేకపోతే సృష్టి మొత్తం అంధకారం అవుతుందన్నారు. అనంతరం కోర్టు ఆవరణలో ఏర్పాటుచేసిన నూతన వాటర్ ప్లాంట్‌ను వారు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు, అడిషనల్ పీపీ శ్రీనివాస్, ఏజీపీ గోపాలకష్ణమూర్తి, న్యాయవాదులు ఎస్ఎస్‌ఆర్, ఎ. శ్రీనివాసరెడ్డి, ఎన్. సత్యనారాయణ, రవికుమార్, జక్కుల వీరయ్య, యాదగిరి, నాగార్జున, సురేష్, నారాయణరెడ్డి, రామలక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా వార్డు కమిటీలు

- మున్సిపాలిటీల అభివృద్ధిలో కానరాని కమిటీల పాత్ర
- మూడునెలలకోసారి సమావేశాల నిర్వహణ ఊసేలేదు
- పట్టింపులేని పాలకవర్గాలు, అధికారులు



హుజూర్‌నగర్ పట్టణ వ్యూ

హుజూర్‌నగర్: పాలకవర్గం, అధికార యంత్రాంగంతోపాటు ప్రజలను భాగస్వామ్యం చేస్తూ మున్సిపాలిటీలను అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రభుత్వం వార్డు కమిటీలను ఏర్పాటు చేసింది. వార్డుల్లో ఎక్కడ ఎలాంటి సమస్య ఉందో, దాన్ని ఏవిధంగా పరిష్కరించాలో ప్రజల తరఫున పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లే వారే ఈ వార్డు కమిటీల సభ్యులు. స్థానిక ప్రాంతాల అభివృద్ధిలో కీలకమైన వార్డు కమిటీలను అధికారులు పక్కన పెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఇవి కొంత కాలంగా నిస్తేజంగా ఉండి పోయాయి.

5 మున్సిపాలిటీల్లో 141 వార్డులు..

జిల్లాలో 5 మున్సిపాలిటీల్లో 141 వార్డులు ఉన్నాయి. వాటిలో వార్డుకు 4 కమిటీలు కాగా ఒక్కో కమిటీకి 15 మంది చొప్పున మొత్తం 8,460 మంది సభ్యులు ఉన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీలో 48 వార్డులకు 2,880 మంది, కోదాడలో 35 వార్డులకు 2,100 మంది కమిటీ సభ్యులు ఉన్నారు. అలాగే హుజూర్‌నగర్‌లో 28 వార్డులకు 1,680 మంది , తిరుమలగిరిలో 15 వార్డులకు 900 మంది, నేరేడుచర్లలో 15 వార్డులకు 2,880 మంది కమిటీ సభ్యులు ఉన్నారు.

ఒక్కో వార్డుకు 4 కమిటీలు.. 15 మంది సభ్యులు

ప్రతి వార్డుకు నాలుగు కమిటీలు ఉంటాయి. మొదటి కమిటీలో స్థానిక యువత, రెండో కమిటీలో మహిళలు, మూడో కమిటీలో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్ ఉంటారు. నాలుగో కమిటీలో పుర ప్రముఖులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉంటారు. మున్సిపాలిటీల్లో జనాభాను బట్టి వార్డులు విభజిస్తారు. ఒక్కో వార్డుకు 4 కమిటీలు ఉంటాయి. ఒక్కో కమిటీకి 15 మంది సభ్యుల చొప్పన ఒక్క వార్డుకు 60 మంది సభ్యులు ఉంటారు. వీరితో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించి కమిటీ సభ్యుల సూచనలతో ఆయా వార్డుల్లో పనులు చేయాల్సి ఉంటుంది. ఎక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలన్నా వార్డు కమిటీ సభ్యులతో చర్చించి పాలకవర్గం ఆమోదించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. అందుకే ఆయా కమిటీల్లో ఎంపికైన వారు స్థానిక సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించాలి. ముఖ్యంగా అంతర్గత రోడ్ల నిర్మాణం, మురుగు కాల్వలు, వీధి దీపాల నిర్వహణ, రహదారుల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, సాధారణ మరమ్మతులు వంటి అంశాలను పరిష్కరించేందుకు వార్డు కమిటీల సమావేశాలు జరపాలి. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కమిటీలు నామమాత్రంగా మారాయి. ఇకనైనా వాటి పనితీరులో మార్పు రావాలని పుర ప్రజలు కోరుతున్నారు.

వార్డు కమిటీలను చైతన్యవంతం చేస్తాం



మున్సిపాలిటీ పరిధిలోని వార్డు కమిటీలతో గత సెప్టెంబర్‌లో సమావేశాలు నిర్వహించాం. వార్డు అభివృద్ధి విషయమై వారి నుంచి సలహాలు సూచనలు స్వీకరించాం. మరోసారి సమావేశాలు నిర్వహించడంలో కొంత ఆలస్యం అయింది. ప్రతి మూడు నెలలకు ఒక సారి సమావేశాలు నిర్వహిస్తాం. నిస్తేజంగా ఉన్న వార్డు కమిటీలను చైతన్యవంతం చేస్తాం.

– కె. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్, హుజూర్‌నగర్

రెండేళ్ల క్రితం నియామకం..

పట్టణాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రధాన పాత్ర పోషించేందుకు రెండేళ్లక్రితం వార్డు కమిటీలను నియమించారు. తొలినాళ్లలో కమిటీలు కొంత పని చేసినట్లు అనిపించాయి. ఆ తర్వాత నామమాత్రం అయ్యాయి. దీంతో పట్టణాల్లో సమస్యలు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారం కావడంలేదనే ఆరోపణలున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు వార్డు కమిటీలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షల తనిఖీ

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను మంగళవారం డీఐఈఓ జానపాటి కృష్ణయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు మన్నెం సోమయ్య, లక్ష్మయ్య, జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ రాజయ్య ఉన్నారు.

ఆరుగురికి కారుణ్య నియామకాలు



కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ గుజ్జ దీపిక

సూర్యాపేటటౌన్ : జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం కారుణ్య నియామకాలు చేపట్టారు. ఆరుగురిని ఆఫీస్ సబార్డినేట్‌లుగా నియమించారు. ఈ మేరకు జెడ్పీ చైర్ పర్సన్ గుజ్జ దీపిక వారికి నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమేష్, జిల్లా అధ్యక్షుడు నాగయ్య, కోశాధికారి లింగయ్య పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎఫ్ఓ ముకుందరెడ్డి

కోదాడరూరల్ : అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా ఫారెస్ట్ అధికారి ముకుందరెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో గల తేజవిద్యాలయ పాఠశాలలో పర్యావరణం పరిరక్షణ–మానవాళిబాధ్యత అనే అంశంపై విద్యార్థులతో నిర్వహించిన ముఖా ముఖి సమావేశంలో ఆయన మాట్లాడారు. అడవులు, వన్యప్రాణులను కాపాడాలన్నారు. ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. అడవుల శాతం తగ్గితే మానవ మనుగడకే ముప్పు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమాదేవి, సోమిరెడ్డి ఉన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి



పాలకవీడులో అవగాహన కల్పిస్తున్న డీపీఓ యాదయ్య

పాలకవీడు: అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని డీపీఓ యాదయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్వచ్ఛ భారత్ మిషన్ ఫేజ్–2 విధివిధానాలపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, వీఓఏలు, క్షేత్ర సహాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిచెత్త పొడి చెత్త సేకరించే విధానం, బహిరంగ మల మూత్ర విసర్జన ర హిత గ్రామాలుగా తీర్చిదిద్దడం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్యం, మురుగునీటి వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటాచారి, ఎంపీఓ దయాకర్, ఎంఆటి ట్రైనర్లు నరేందర్‌రెడ్డి సర్పంచ్‌లు, కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- కలెక్టర్ వెంకట్రావు



కుదకుద గ్రామంలోని బస్తీ దవాఖానాలో వైద్య సేవలు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

చివ్వెంల(సూర్యాపేట) : మహిళలకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని కలెక్టర్ ఎస్. వెంకట్రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో బస్తీ దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహిళా ఆరోగ్య కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రతి మంగళవారం జిల్లాలో నిర్దేశించిన అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళలు తమ ఆరోగ్య సమస్యలకు సేవలు పొంది సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. హాస్పిటల్‌కు వచ్చే ప్రతి మహిళను క్షుణ్ణంగా పరిశీలించి వారి సమస్యలను వైద్య సిబ్బంది తెలుసుకుని సేవలు అందించాలన్నారు. మహిళలు క్యాన్సర్, బీపీ, షుగర్, గర్భాశయ వ్యాధులను నిర్ణీత సమయంలో గుర్తించి చికిత్స పొందాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట జిల్లా వైద్యాధికారి కోటాచలం తదితరులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తును వేగవంతం చేస్తున్నాం : ఎస్పీ

సూర్యాపేటక్రైం : సాంకేతికతను సద్వినియోగం చేసుకుని కేసుల దర్యాప్తును వేగవంతం చేస్తున్నామని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. డీజీపీ పోలీస్ అధికారులతో హైదరాబాద్‌నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ పాల్గొన్నారు. పోలీస్‌శాఖ పనితీరును వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, ఏఓ సురేష్ బాబు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ నర్సింహా, సర్కిల్ సీఐలు సోమ్ నారాయణ్ సింగ్, రాజేష్, నాగార్జున, రామలింగారెడ్డి, ఆంజనేయులు, శివ శంకర్, రాజశేఖర్, గౌరీ నాయుడు, ఆర్ఐ శ్రీనివాసరావు, శ్రీనివాస్, నర్సింహారావు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

మట్టపల్లి ఆలయ హుండీల లెక్కింపు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ హుండీల లెక్కింపును మంగళవారం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రమేష్ పర్యవేక్షణలో స్థానికంగా చేపట్టారు. వివరాలను ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ సిరికొండ నవీన్‌లు వెల్లడించారు. 42రోజుల హుండీ ఆదాయం రూ.5,24,750, అన్నదాన హుండీ ద్వారా రూ.37,470 ఇలా మొత్తం ఆదాయం 5, 62, 220 వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయిసేవాసంఘం ప్రతినిధులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షే..

- కొత్త మండలాల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలు లేక పాట్లు
- కిలోమీటర్ల కొద్దీ ప్రయాణం చేయాల్సిందే
- రవాణా సౌకర్యంలేక తప్పని ఇబ్బందులు
- ఏప్రిల్‌3 నుంచి పదో తరగతి పరీక్షలు



ఈ ఫొటోలో కన్పిస్తున్న విద్యార్థిని పేరు గుర్ర శ్రీజ. మద్దిరాల మండలం కుక్కడం జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతోంది. మద్దిరాల మండల కేంద్రంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయలేదు. దీంతో పరీక్ష రాయాలంటే రానుపోను తుంగతుర్తికి 26 కి.మీ. ప్రయాణం చేయాల్సిందే. సమయానికి బస్సుసౌకర్యం ఉండదు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాలి. ఇవీ కొత్త మండలాల్లో పదో తరగతి పరీక్ష కేంద్రం లేక విద్యార్థుల పడే ఇబ్బందులకు నిదర్శనం.



పరీక్ష రాసేందుకు డీసీఎంలో తుంగతుర్తికి వెళుతున్న విద్యార్థులు (ఫైల్)

నాగారం: జిల్లాలో నూతనంగా ఏర్పడిన మండలాల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలు లేక విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. సరైన రవాణా సౌకర్యాలు లేక ఏటా కిలోమీటర్ల కొద్దీ ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఏడేళ్లవుతున్నా పరీక్ష కేంద్రాల ఏర్పాటు ఊసేలేదు. జిల్లాలో 2016లో నాగారం, మద్దిరాల, అనంతగిరి, చింతలపాలెం, పాలకవీడు ఐదు మండలాలు కొత్తగా ఏర్పడ్డాయి. ఈ మండలాల్లో 26 జెడ్పీహెచ్‌ఎస్‌లు, మూడు కేజీబీవీలు, ఎనిమిది ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల నుంచి ఈ ఏడాది 1,019 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. స్థానికంగా పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు పక్క మండలాలకు వెళ్లాల్సి వస్తోంది. బస్సులు లేదా ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. మారుమూల గ్రామాల్లో ఉదయం వేళల్లో బస్సు సౌకర్యం లేని పల్లెలు పదుల సంఖ్యలో ఉన్నాయి. అలాంటి చోట్ల నడిచివెళ్లాల్సి వస్తోంది. పరీక్ష కేంద్రాలు పది కిలోమీటర్ల కంటే దూరంగా ఉండటంతో వేళకు చేరుకోవడం ఒక సమస్య అయితే...రాకపోకలకు సమయం వృథా అవుతుందని, పైగా ఆలస్యమైతే కేంద్రాల్లోకి అనుమతి ఉండదని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

కొత్త మండలాల్లో పరిస్థితి ఇదీ..

→ నాగారం మండలంలో ఆరు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక మోడల్ స్కూల్, ఒక ప్రైవేట్ పాఠశాల ఉన్నాయి. ఈ స్కూళ్ల నుంచి ఈ ఏడాది 220 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. మండలానికి చెందిన విద్యార్థులు పదో తరగతి పరీక్షల కోసం మూడు మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పసునూర్, పస్తాల, శాంతినగర్, లక్ష్మాపురం గ్రామాల విద్యార్థులు తుంగతుర్తిలో, నాగారం, నాగారంబంగ్లా, వర్ధమానుకోట, మాచిరెడ్డిపల్లి, డి.కొత్తపల్లి, పేరబోయినగూడెం, నర్సింహులగూడెం గ్రామాల విద్యార్థులు జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలో, ఫణిగిరి, ఈటూరు, మామిడిపల్లి గ్రామాల విద్యార్థులు తిరుమలగిరి మండల కేంద్రంలో పది పరీక్షలు రాయనున్నారు. దీంతో విద్యార్థులు సుమారు 8 నుంచి 10 కి.మీపైగా దూరం ప్రయాణించాల్సి ఉంది. పలు గ్రామాలకు సరైన రవాణా సౌకర్యం లేదు.

→ మద్దిరాల మండలంలో 7 జెడ్పీహెచ్‌ఎస్, 1 కేజీబీవీ ఉన్నాయి. ఈ పాఠశాలల పరిధిలో 150 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. మండల విద్యార్థులకు స్థానికంగా పరీక్ష కేంద్రం లేక తుంగతుర్తి, నూతనకల్ మండలాలకు వెళ్లి పరీక్షలు రాయాల్సి వస్తుంది. కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. మరికొందరు విద్యార్థులను తల్లిదండ్రులు వారి పనులు మానుకొని పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లాల్సి వస్తుంది.

→ చింతలపాలెం మండలంలో 3 జెడ్పీ ఉన్నత పాఠశాలలు , ఆరు ప్రైవేట్ హైస్కూల్స్ ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొత్తం 285 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరిలో తమ్మారం జెడ్పీహెచ్‌ఎస్ నుంచి 49 మంది, చింతపాలెం జెడ్పీహెచ్‌ఎస్ నుంచి 28 మంది, ఇక్కడి రెండు ప్రైవేట్ పాఠశాలల నుంచి 99 మంది , దొండపాడు హైస్కూల్ నుంచి 33మంది, ఇక్కడి నాలుగు ప్రైవేట్ పాఠశాలల నుంచి 76 మంది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. స్థానికంగా పరీక్షా కేంద్రం లేక పక్క మండలమైన మేళ్లచెరువుకు వెళ్లాల్సి వస్తుంది. అసలే చివరి మండలం కావడంతో ఇక్కడి నుంచి ఆర్టీసీ, ఇతర ప్రై వేట్ వాహనాల సౌకర్యం లేదు. దీంతో విద్యార్థులే సొంతంగా వాహనాలను ఏర్పాటు చేసుకోవాల్సి వస్తుంది.

→ అనంతగిరి మండలంలో 7 జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలు ఉండగా వీటి పరిధిలో 264 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. అయితే గొండ్రియాల జెడ్పీహెచ్‌ఎస్‌లో 22 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరు వార్షిక పరీక్షలు రాయడానికి 13 కి.మీ దూరంలో ఉన్న కోదాడకు వెళ్లాలి. సరైన రవాణా సౌకర్యం లేక కొందరు విద్యార్థులు తల్లిదండ్రుల బైక్‌లపై, మరికొందరు ఆటోలపై, ఇంకొందరు కాలినడకన వెళ్లాల్సి వస్తుంది.

→ పాలకవీడు మండలంలో 3 జెడ్పీహెచ్‌ఎస్‌లు, 1 కేజీబీవీ, 1 ప్రైవేట్ పాఠశాల ఉన్నాయి. ఈ పాఠశాలల నుంచి మొత్తం 122 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు. ఈ విద్యార్థులు నేరేడుచర్ల మండల కేంద్రానికి పదో తరగతి పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. మండలం నుంచి బస్సు సౌకర్యం లేదు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆటోలు ఏర్పాటు చేసి విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్లనున్నట్లు ఎంఈఓ చత్రునాయక్ తెలిపారు.

పరీక్ష కేంద్రాల ఏర్పాటుకు మౌలిక వసతులు ఉండాలి



పదో తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలంటే విద్యార్థుల సంఖ్య కనీసం 100 నుంచి 150 మధ్య ఉండాలి. దీంతో పాటు పరీక్షల నిర్వహణకు తరగతి గదులతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు ఉండాలి. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థుల వివరాలు తీసుకొని ఆరు నెలల ముందే రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి నివేదించాం. విద్యార్థుల సంఖ్యను బట్టి పరీక్ష కేంద్రాలు కేటాయించారు.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట.

క్లుప్తంగా

కల్తీ పాలు స్వాధీనం


కల్తీ పాలతో నిందితుడు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని కప్రాయిపల్లి గ్రామంలో కల్తీ పాలు తయారుచేస్తున్న ఇంటిపై మంగళవారం ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి కల్తీ పాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కప్రాయిపల్లి గ్రామానికి చెందిన పాల వ్యాపారి పిండి జంగయ్య కల్తీ పాలను తయారుచేసి సొంత వాహనంలో హైదరాబాద్‌లోని హోటళ్లు, వినియోగదారులకు విక్రయిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు మంగళవారం ఉదయం పిండి జంగయ్య ఇంటిపై దాడి చేసి 80లీటర్ల కల్తీ పాలతో పాటు పాలలో వినియోగించే 100 మిల్లీలీటర్ల హైడ్రోజన్ పెరాక్సైడ్, 3 కిలోల స్కిమ్డ్ పాల పౌడర్‌ను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రె పొట్టేళ్లు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పొట్టేళ్లు

మోత్కూరు: కుక్కలు దాడిలో ఐదు గొర్రె పొట్టేళ్లు మృతిచెందగా మరో ఐదు తీవ్ర గాయాలపాలయ్యాయి. ఈ సంఘటన మోత్కూరు మండలంలోని దాచారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. దాచారం గ్రామానికి చెందిన జాల అశోక్, అండెం చిన పిచ్చిరెడ్డిలకు చెందిన పది గొర్రె పొట్టేళ్లపై కుక్కలు దాడి చేయడంతో ఐదు గొర్రె పొట్టేళ్లు అక్కడికక్కడే మృతిచెందాయి. మరో ఐదు తీవ్ర గాయాల పాలయ్యాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సత్యనారాయణ (ఫైల్)

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు గ్రామానికి చెందిన బొరెండి సత్యనారాయణ(30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య స్వప్న, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సత్యనారాయణ సోమవారం బ్యాంకు పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై నల్లగొండకు వెళ్తుండగా మల్లేపల్లివారిగూడెం వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో సత్యానారాయణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం అతడిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి బాబాయి పేరం వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వాస ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు.

అన్నను హత్య చేసిన తమ్ముడు

- మద్యం మత్తులో ఘాతుకం
- పోలీసులకు సమాచారం ఇచ్చి లొంగిపోయిన నిందితుడు
- గుండాల మండలంలోని రామారం గ్రామంలో ఘటన


మరిపెల్లి నర్సయ్య (ఫైల్)

గుండాల: మద్యం మత్తులో అన్నను తమ్ముడు హత్య చేసిన ఘటన మండలంలోని రామారం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రామారం గ్రామానికి చెందిన మరిపెల్లి అంజయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య లాలమ్మ కుమారుడు మరిపెల్లి నర్సయ్య(55) పుట్టిన తర్వాత అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో లాలమ్మ సొంత చెల్లెలు సుగుణమ్మను అంజయ్య రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. అంజయ్య మరణానంతరం సుగుణమ్మ గ్రామంలోనే తమ ఇంటి ఆవరణలో గుడిసె వేసుకుని అందులో నివసిస్తోంది. సుగుణమ్మ పెద్ద కుమారుడు గతంలోనే మృతిచెందగా, రెండో కుమారుడు మరిపెల్లి సాయికిరణ్‌కు 18 సంవత్సరాల క్రితం తిరుమలగిరి మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన ధనలక్ష్మితో వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. కొంతకాలం వీరి కాపురం సాఫీగా సాగిన తర్వాత సాయికిరణ్ తాగుడుకు బానిసై జులాయిగా తిరుగుతూ నిత్యం భార్యను వేధించేవాడు. భర్త వేధింపులు భరించలేక ధనలక్ష్మి తన ఇద్దరు పిల్లలను తీసుకొని తల్లిగారింటికి వెళ్లింది. అప్పటి నుంచి సాయికిరణ్ నిత్యం తాగి వచ్చి తల్లి వద్దే గుడిసెలో ఉంటున్నాడు. అంజయ్య మొదటి భార్య కుమారుడు నర్సయ్యకు భార్య అంజమ్మ, కుమారుడు వెంకటేష్, ఇద్దరు కుమార్తెలు సంతానం. ఇద్దరు కుమార్తెల పెళ్లిళ్లు చేశాడు. నర్సయ్య బతుకుదెరువు కోసం భార్య, కుమారుడితో కలిసి చెన్నై వలస వెళ్లి, కరోనా సమయంలో తిరిగి సొంత గ్రామానికి వచ్చి కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కరోనా తర్వాత నర్సయ్య భార్య, కొడుకు తిరిగి చెన్నై వెళ్లిపోగా, అతడు మాత్రం ఇక్కడే ఉంటున్నాడు. ఇటీవల నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. కాగా సోమవారం రాత్రి నర్సయ్య ఇంట్లో తమ్ముడు సాయికిరణ్‌తో కలిసి మద్యం సేవిస్తూ భోజనం చేస్తున్నాడు. ఈ క్రమంలో 'నీ భార్యను కాపురానికి తీసుకొచ్చి పిల్లలను జాగ్రత్తగా చూసుకో..' అని సాయికిరణ్‌కు నర్సయ్య సూచించాడు. 'నా కుటుంబం నా ఇష్టం.. నువ్వు నాకు ఏమీ చెప్పొద్దు' అని సాయికిరణ్ నర్సయ్యతో గొడవకు దిగాడు. వీరిద్దరి మధ్య మాటామాట పెరగడంతో కోపోద్రిక్తుడైన సాయికిరణ్ ఇంటి బయట ఉన్న బోరు మోటార్లను ఊడదీసే పానతో నర్సయ్య తలపై బలంగా కొట్టాడు. దీంతో నర్సయ్య తల పగిలి రక్తపుమడుగులో కొట్టుమిట్టాడుతుండగా నిందితుడు 100కు డయల్ చేసి తన అన్నను కొట్టినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మృతుడి పెద్ద కుమార్తె ఎలిమినేటి జానకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలేరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనంపై ధాన్యం ట్రాక్టర్ బోల్తా

- అపస్మారకస్థితిలోకి వెళ్లిన వాహనదారుడు
- మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలింపు


సంఘటనా స్థలంలో ద్విచక్ర వాహనం, ట్రాక్టర్

పాలకవీడు: ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే వెళ్తున్న ద్విచక్ర వాహనంపై బోల్తా పడడంతో వాహనదారుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ సంఘటన మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలంలోని యల్లాపురం గ్రామానికి చెందిన ఓ రైతు ట్రాక్టర్‌లో ధాన్యం లోడుతో నేరేడుచర్ల వైపు వస్తున్నాడు. అదే సమయంలో హనుమయ్యగూడెం గ్రామానికి చెందిన గజ్జల భగవంతరెడ్డి నేరేడుచర్ల నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో గుడుగుంట్లపాలెం గ్రామంలోని మూలమలుపు వద్దకు రాగానే ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే వెళ్తున్న భగవంతరెడ్డిపై బోల్తా పడింది. దీంతో భగవంతరెడ్డి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. సమాచారం అందుకున్న గుడుగుంట్లపాలెం గ్రామ సర్పంచ్ కిష్టిపాటి అంజిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడికి సీపీఆర్ చేసి శ్వాస అందించారు. 108 వాహనానికి సమాచారం అందించగా, అది రావడం ఆలస్యం కావడంతో ఆటోలో మిర్యాలగూడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం భగవంతరెడ్డిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. అయితే ట్రాక్టర్ డ్రైవర్ మద్యం సేవించి అతివేగంగా నడపడంతోనే ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై సైదులు తెలిపారు.

నీటిపాలైన ధాన్యం


కాల్వలోకి కొట్టుకుపోతున్న ధాన్యం

పెన్‌పహాడ్: ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడడంతో ధాన్యం నీటి పాలైన సంఘటన మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని అనాజిపురం గ్రామానికి చెందిన మట్టపల్లి వెంకన్న ట్రాక్టర్‌లో ధాన్యాన్ని మిర్యాలగూడలోని మిల్లుకు తరలిస్తుండగా దోసపహాడ్ గ్రామ శివారులో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో ధాన్యం కాల్వలోకి జారిపోవడంతో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీటిపాలవ్వడంతో ఆ రైతు కన్నీరుమున్నీరయ్యాడు.

అప్పడాల బిజినెస్ పేరుతో మోసం

- 50 మంది నుంచి రూ.500 చొప్పున వసూలు చేసిన మహిళ


బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

కొండమల్లేపల్లి: సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో అప్పడాల బిజినెస్ పేరిట ఓ మహిళ డబ్బులు వసూలు చేసి మోసం చేసిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలంలోని చేపూరు గ్రామానికి చెందిన కోరె సరళ మదర్ థెరిస్సా సమైక్య ట్రస్ట్ పేరుతో ఉపాధి కల్పిస్తామని చెప్పి కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో ప్రచారం నిర్వహించింది. ఒక్కో మహిళకు కేజీ పిండి ఇస్తామని, వాటిని అప్పడాలుగా తయారు చేస్తే ఒక్కో ప్యాకెట్‌ను రూ.10 చొప్పున ఇస్తానని మహిళలకు మాయమాటలు చెప్పింది. మొదటగా రూ.500 కడితే ట్రస్ట్‌లో సభ్యత్వం వస్తుందని చెప్పగా, సుమారు 50మంది వరకు రూ.500 చొప్పున చెల్లించారు. ఆ 50మంది అప్పడాలు తయారుచేసి ఇవ్వగా, వారికి డబ్బులు సకాలంలో ఇవ్వకపోవడంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు బాధితుల నుంచి వివరాలు సేకరించి, సరళను విచారించగా డబ్బులు తిరిగి చెల్లిస్తానని పేర్కొన్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

చండూరు: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మత్స్యకారుడు మృతిచెందిన ఘటన మండలం పరిధిలోని ఉడతలపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం జి.యడవెల్లి గ్రామానికి చెందిన మత్స్యకారుడు సోము శ్రీను(52) చండూరు మండలం ఉడతలపల్లి గ్రామ చెరువులో చేపలు పట్టేందుకు వచ్చాడు. చేపల కోసం చెరువులో వల వేసి తిరిగి వలను తీస్తుండగా అతడి ప్యాంట్ కంపకు తగలడంతో చెరువులోని గుంతలో పడిపోయాడు. చేపలు కొనేందుకు వచ్చిన గ్రామస్తులు గమనించి అతడి బయటకు తీసే చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నవీన్ కుమార్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అతడికి జి. యడవెల్లి గ్రామ మత్స్య సొసైటీలో సభ్యత్వం ఉంది.

నీటి ఆవశ్యకతపై అవగాహన పెంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఐసీఏఆర్ శాస్త్రవేత్త భజేంద్ర

మోత్కూరు: నీటి ఆవశ్యకతపై రైతులు, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐసీఏఆర్) శాస్త్రవేత్తలు భజేంద్ర, ముత్తూరామన్ అన్నారు. మంగళవారం మండలంలోని దత్తప్పగూడెం రైతు వేదికలో రైతు ఉత్పత్తి సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని రైతులు, విద్యార్థులకు నీటి ఆవశ్యకతపై నిర్వహించిన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. నీటి వినియోగం, నీటి కాలుష్యం తదితర విషయాలను వివరించారు. భూసార పరీక్షలు నిర్వహించి నేల సామర్థ్యం, అనువైన పంటల దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎలుగు శోభ, ఎంపీటీసీ సభ్యుడు ఆకవరం లక్ష్మణాచారి, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆర్థిక సహకారంతో సిరి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ మత్స్యగిరి, రైతు సంఘం సీఈఓ నర్సింహాచారి, మండల వ్యవసాయ అధికారి స్వప్న, ఏఈఓ సైదులు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం పరిశీలన


ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో అసోం రాష్ట్ర వ్యవసాయ అధికారులు

తుర్కపల్లి: అసోం రాష్ట్ర వ్యవసాయ అధికారులు మండలంలోని వాసాలమర్రి గ్రామంలో గల అరుణ్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్, హైదరాబాద్‌లో జరుగుతున్న ట్రైనింగ్‌లో భాగంగా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గానుగతో నూనె తయారీ విధానం, సేంద్రియ ఎరువులు, జీవామృతం, ఘన జీవామృతం తయారీని పరిశీలించారు. ఐదు దొంతర్ల పద్ధతి ద్వారా పండ్ల మొక్కల పెంపకం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసోం రాష్ట్ర ఏడీఓ పీపీ ఉపానంద పట్వారీ, బీటీఎం బర్నాలి దాస్, బోడాన్ లోహాన్, నూమల్ డీయోరీ బారాలీ, ఉదీప్త కున్వార్, రంజీత్ బోరా, సుక్యన గోగీ, దబ్‌జీత్ సేనాపతి, శ్యామల్ బూరా, బీపీల్ కేర్‌నాథ్, జోయాగోస్వామి, ముత్యు జయ శిఖా, సంతోష్ గుహన్, మృణాల్ కాంత్, ధనుంజయ ముసారి, రాజు పుకాన్, పరంజీత్ భూయన్, జయంతా మదుహదత్, కమలేందర్ బ్రహ్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో 6నెలల కాల పరిమితి గల కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్), సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్, టైలరింగ్ ఎంబ్రాయిడరీ జర్దోజి, క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ టెక్నీషియన్ కోర్సుకు ఇంటర్మీడియట్ పాస్ లేదా ఫెయిల్, ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్), సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు ఐటీఐ లేదా డిప్లొమా పాస్, టైలరింగ్ ఎంబ్రాయిడరీ జర్దోజి, క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సుకు 8వ తరగతి విద్యార్హత కల్గి ఉండాలన్నారు. 18 నుంచి 25 సంవత్సరాల లోపు వయస్సు కల్గినవారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఏప్రిల్ 10న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఉద్యోగం కల్పించబడుతుందని చెప్పారు. వివరాలకు 9133908000, 9133908111, 9133908222 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

వెట్టిచాకిరి నుంచి కూలీలకు విముక్తి


యాద్గార్‌పల్లి గ్రామంలో తమిళనాడు వలస కూలీలకు విముక్తి కల్పించిన అధికారులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లిలో మంగళవారం తమిళనాడు రాష్ట్రానికి చెందిన వలస కూలీలకు వెట్టిచాకిరి నుంచి అధికారులు విముక్తి కల్పించారు. మిర్యాలగూడ రూరల్ అదనపు ఎస్‌ఐ ముత్యాల రాంమ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఎలక నాగరాజు తమిళనాడు రాష్ట్రంలోని చెంగల్‌పేట జిల్లాకు చెందిన శంకరం మాణిక్యం, అతడి భార్య లక్ష్మి, కుమారులు కార్తీక్, ఆకాశ్‌ను ఐదేళ్ల క్రితం యాద్గార్‌పల్లికి రప్పించి గ్రామ శివారులో గల బాతుల ఫాం వద్ద పనికి ఉంచాడు. వారితో పనిచేయించుకుంటూ డబ్బులు ఇవ్వకుండా శ్రమ దోపిడీ చేస్తున్నాడు. కొంతమంది ఎన్జీఓస్ ద్వారా దీనిపై సమాచారం అందుకున్న యాంటీ హ్యూమన్ ట్రాకింగ్ యూనిట్(ఏహెచ్‌టీయూ), లేబర్, రెవెన్యూ అధికారులు, పోలీసులు మంగళవారం యాద్గార్‌పల్లి గ్రామానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలక నాగరాజు తమకు పనికి తగిన వేతనం ఇవ్వకపోవడంతో పాటు డబ్బులు అడిగితే బెదిరిస్తున్నాడని తమిళనాడుకు చెందిన కూలీలు అధికారులకు వివరించారు. దీంతో వారికి వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించి, మండల తహసీల్దార్ అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎలక నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు అదనపు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఏహెచ్‌టీయూ ఎస్‌ఐ జె. గోపాల్‌రావు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మంజుల, ఏహెచ్‌టీయూ సిబ్బంది నర్సింహ్మా, మధు తదితరులున్నారు.

అంబులెన్స్‌కు మంటలు

మిర్యాలగూడ అర్బన్: చెత్త కుప్పకు నిప్పుపెట్టడంతో పక్కనే నిలిపి ఉంచిన అంబులెన్స్ స్వల్పంగా దగ్ధమైన సంఘటన మిర్యాలగూడ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. మిర్యాలగూడ పట్టణంలోని ఎస్ఎస్‌పీ క్యాంపు మినీ రవీంద్రభారతి ఎదురుగా చెత్తకుప్పలకు గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం సాయంత్రం నిప్పుపెట్టగా పక్కనే నిలిపి ఉంచిన అంబులెన్స్ టైర్లు, వెనక భాగం కాలిపోయింది. స్థానికులు గుర్తించి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందిచటంతో వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. దీంతో పక్కన మరిన్ని అంబులెన్స్‌లకు పెను ప్రమాదం తప్పింది.

అదుపుతప్పి లారీ బోల్తా


బోల్తాపడిన లారీ

మద్దిరాల: కట్టెల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన మండల పరిధిలోని పోలుమల్ల శివారులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ నుంచి వరంగల్ వైపునకు కట్టెల లోడుతో వెళ్తున్న లారీ పోలుమల్ల శివారుకి చేరుకోగానే అదుపుతప్పి 365వ నంబర్ జాతీయ రహదారి పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

కోదాడరూరల్: మహిళను లైంగికంగా వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కోదాడ రూరల్ ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండల పరిధిలోని రెడ్లకుంట గ్రామానికి చెందిన మహిళను అదే గ్రామానికి చెందిన చిరంజీవి లైంగికంగా వేధిస్తుండటంతో సోమవారం అర్ధరాత్రి ఆమె పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. సదరు మహిళ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిరంజీవిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ మహిళ పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

యాదాద్రిలో నిత్య పూజలు


ఆలయంలో నిత్య కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఇష్టమైన రోజు కావడంతో ఆచార్యులు అకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆంజనేయస్వామిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. అనంతరం అంజనీపుత్రుడికి ఇష్టమైన నైవేద్యాన్ని ఆరగింపు పెట్టారు. ప్రధానాలయంలో, విష్ణు పుష్కరిణి, అనుబంధ ఆలయాలైన శివాలయం, పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాల వద్ద ఉన్న ఆంజనేయస్వామిని భక్తులు మొక్కుకొని, పూజలు చేశారు. ఇక ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలను విశేషంగా నిర్వహించారు.

నిధుల దుర్వినియోగంపై డీఎల్‌పీఓ విచారణ


భీమనపల్లి పంచాయతీ కార్యాలయంలో విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ ప్రతాప్‌నాయక్

మాడుగులపల్లి : మండలంలోని భీమనపల్లి, సీత్యాతండా, గండ్రవానిగూడెం గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం జరిగిందన్న అభియోగాలపై మంగళవారం డీఎల్‌పీఓ ప్రతాప్‌నాయక్ విచారణ చేపట్టారు. పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన సమాచార హక్కు సంరక్షణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు అనంతాచారి ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదుదారుడి సమక్షంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఆయా పంచాయతీల్లో ఎంబీ రికార్డులు, క్యాష్ బుక్స్, ఇతర రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. రికార్డులను పరిశీలించి నెలరోజుల్లో జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక డీఎల్‌పీఓ అందజేస్తామన్నారు.

ఎందరు మోదీలు వచ్చినా కేసీఆర్‌ను ఏమీ చేయలేరు

రాజాపేట : బీఆర్ఎస్ పార్టీతో ఉనికి కోల్పోతామని నరేంద్ర మోదీ ప్రభుత్వం కేసీఆర్‌ను అణచివేసే ప్రయత్నం చేస్తోందని, ఇలాంటి నరేంద్రమోదీలు ఎందరు వచ్చినా కేసీఆర్‌ను ఏమీ చేయలేరని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. మంగళవారం మండలంలోని రఘునాథపురంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం లేకుండాపోయిందని, మాట్లాడితే కేసులు పెడుతున్న బీజేపీని బొందపెట్టాలని అన్నారు. ప్రశ్నించిన రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం అప్రజాస్వామికమన్నారు. ఎమ్మెల్సీ కవితను రాజకీయ కుట్రతోనే ఈడీ పేరుతో ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. రోజుల తరబడి విచారణ పేరుతో కేసీఆర్‌ను, కవితను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తూ భారత దేశంలో ఇతర పార్టీ ఉండకుండా మోదీ ముందుకు సాగుతున్నాడని విమర్శించారు. కేసీఆర్‌ను ఏదో రకంగా ఇబ్బంది పెట్టి రాజకీయంగా దెబ్బతీయ్యాలని చూస్తున్నారని అన్నారు.

